# గుజ్జులపల్లికి సాగు నీళ్లొచ్చినయ్!

**ఆనందంలో ఆయకట్టు రైతులు**

**నమస్తే ఎఫెక్ట్**

సైదాపూర్, ఫిబ్రవరి 21: కరీంనగర్ జిల్లా గుజ్జులపల్లి శివారులోని మిడ్‌మానేరు ఆయకట్టు భూములకు నీళ్లు వచ్చాయి. రెండు రోజుల కిందట 'నమస్తే తెలంగాణ' మెయిన్ పేజీలో 'సాగునీళ్లివ్వకుండా సంపుతరా' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన నీరందించి పంటలను కాపాడాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు ప్రాజెక్టు కుడి కాలువలో పేరుకుపోయిన తుంగ, పొదలను తొలగించారు. బుధవారం నీటి పరిమాణాన్ని పెంచి ఎండుతున్న పంట పొలాలకు మళ్లించారు. మిడ్‌మానేరు కుడి కాలువలో నీటి ప్రవాహన్ని ఎస్సారెస్పీ డీఈ సమ్మయ్య పరిశీలించారు. పంటలు ఎండుతున్న సమయంలో నీరందడంతో రైతులు సంతోషం వ్యక్తంచేశారు. తమ సమస్యను వెలుగులోకి తెచ్చిన 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు.



మిడ్‌మానేరు కుడి కాలువలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్సారెస్పీ డీఈ సమ్మయ్య

# ఇసుకపై రాస్తే పాతాళానికి తొక్కేస్తాం

- సీతక్కపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోం
- ఆ పేపర్‌ను గ్రామాల్లో నిషేధిస్తాం
- నమస్తే తెలంగాణపై ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఫైర్

ఉట్నూర్, ఫిబ్రవరి 21: పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హెచ్చరించారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రి సీతక్క జిల్లాకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ప్రతి సమావేశానికి ప్రతిపక్షాలను పిలుస్తూ అందరికీ సమాన గౌరవం ఇస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో గిరిజనులకు సేవచేస్తూ అందరి మన్ననలను పొందారని గుర్తుచేశారు. అలాంటి నాయకురాలిపై 'నమస్తే తెలంగాణ' ఇసుక దందా పేరిట తప్పుడు వార్తలు రాస్తున్నదని మండిపడ్డారు. ఆ పత్రికపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు గ్రామాల్లో నిషేధిస్తామని, పేపర్‌ను పాతాళానికి తొక్కేస్తామని, కాలుస్తామని అనుచిత వ్యాఖ్యలు చేశారు.



మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

## హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చేసిన కేసీఆర్

- గత పాలకుల నిర్ణయాలను కొనసాగిస్తాం
- సీఐఐ సదస్సులో సీఎం రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): రాజకీయాలు ఎలా ఉన్నా హైదరాబాద్‌ను మాజీ సీఎం కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. కేసీఆర్‌కు ముందున్న ముఖ్యమంత్రులు చంద్రబాబు, వైఎస్సార్‌లు సైతం హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారని కొనియాడారు. గత పాలకులు తీసుకున్న మంచి నిర్ణయాలను తాము కొనసాగిస్తామని చెప్పారు. గచ్చిబౌలిలోని హోటల్ వెస్టిన్‌లో బుధవారం సీఐఐ తెలంగాణ ఆధ్వర్యంలో 'విద్య, నైపుణ్యాభివృద్ధి – వ్యవస్థాపక అవకాశాలు' అంశంపై నిర్వహించిన సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఎన్నికలయ్యాక తాము రాజకీయాలు చేయడం లేదని, ప్రస్తుతం తాము అభివృద్ధిపైనే దృష్టిసారించామని అన్నారు. రాష్ట్రంలో స్కిల్లింగ్ యూనివర్సిటీల ఏర్పాటు కోసం సంప్రదింపులు జరుపుతున్నామని.. స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో చేరిన వారికి డిగ్రీ సర్టిఫికెట్స్ ఇవ్వబోతున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 64 ఐటీఐలను రూ.2వేల కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా అభివృద్ధి చేయబోతున్నామని చెప్పారు. పారిశ్రామిక ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు రాష్ట్రంలో డ్రైపోర్ట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. గతంలో కొందరు ఔటర్ రింగ్ రోడ్ అవసరం లేదన్నారని.. ఇప్పుడది హైదరాబాద్‌కు లైఫ్‌లైన్‌గా మారిందని అన్నారు. ప్రపంచ దేశాలతో తెలంగాణ పోటీ పడాలన్నదే తమ ప్రభుత్వ విధానమని వెల్లడించారు. పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని.. అభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వానికి ఎలాంటి బేషజాలు లేవని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి అందరి సహకారం అవసరమని. రాష్ట్రంలో విద్య, ఉపాధి అవకాశాల కల్పనలో సీఐఐతో కలిసి ముందుకెళతామని అన్నారు.


# బీజేపీలో కలకలం

- సీఎం రేవంత్‌ను కలిసిన ఆ పార్టీ ఎమ్మెల్యే పాల్వాయి

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు సీఎం రేవంత్‌రెడ్డిని కలవడంపై ఆ పార్టీలో కలకలం రేపింది. కుమ్రంభీం–ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ ఎమ్మెల్యే అయిన హరీశ్ బాబు బుధవారం ఉదయం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈ వార్త రాజకీయ వర్గాల్లో రోజంతా చర్చనీయాంశంగా మారింది. తమ ఎమ్మెల్యే సీఎంను కలవడంపై తమకు ముందస్తు సమాచారం లేదని బీజేపీ రాష్ట్ర నాయకుడొకరు వ్యాఖ్యానించారు. పూర్వాశ్రమంలో హరీశ్‌బాబు కాంగ్రెస్ నాయకుడే కావడంతో బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఆందోళన చెందుతున్నది. అయితే నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసమే ఆయన సీఎంను కలిసి ఉంటారని హరీశ్ బాబు సన్నిహితులు చెప్తున్నారు.

# ఎడారి చెరకు తెర

- సొంతూరికి మరో ఇద్దరు దుబాయ్ జైలు బాధితులు
- 20 ఏండ్లకు ఇంటికి చేరిన శివరాత్రి మల్లేశం, రవి
- ఫలించిన కేటీఆర్ 17 ఏండ్ల కృషి
- కృతజ్ఞతలు తెలుపుతూ గ్రామంలో ఫ్లెక్సీల ఏర్పాటు







ఇల్లు చేరిన శివరాత్రి మల్లేశం, రవితో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు; కేటీఆర్ మా దేవుడు అంటూ పెద్దూరులో మల్లేశం, రవి కుటుంబసభ్యులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ)/ సిరిసిల్ల రూరల్: ఓ హత్య కేసులో దుబాయ్‌లో 20 ఏండ్లుగా జైలు శిక్ష అనుభవిస్తున్న తెలంగాణ బిడ్డలు మాజీమంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కృషితో ఒక్కొక్కరుగా ఇండ్లకు చేరుతున్నారు. కొద్దిరోజుల క్రితమే ఇద్దరు ఇంటికి చేరగా, బుధవారం సిరిసిల్ల అర్బన్ మండలం పెద్దూరుకు చెందిన అన్నదమ్ములు శివరాత్రి మల్లేశం (48), శివరాత్రి రవి (45) సొంతూరికి చేరారు. వివరాల్లోకి వెళితే.. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేటకు చెందిన దండుగుల లక్ష్మణ్ (48), చందుర్తి మండలం రుద్రంగికి చెందిన నాంపల్లి వెంకటి (48), సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరుకు చెందిన శివరాత్రి మల్లేశం (48), శివరాత్రి రవి (45), జగిత్యాల జిల్లా మానాలకు చెందిన శివరాత్రి హన్మంతు (51) 2004లో ఉపాధి కోసం దుబాయ్ వెళ్లారు. అక్కడ అడ్డమీద కూలీలుగా పనిచేశారు. ఈ క్రమంలో ఓ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా ఉన్న నేపాల్‌కు చెందిన దిల్‌బహదూర్ 2005లో హత్యకు గురయ్యాడు. ఈ కేసులో ఈ ఐదుగురికి అక్కడి కోర్టు 25 ఏండ్ల జైలు శిక్ష విధించింది. అయితే తమ వారిని విడిపించాలని కుటుంబ సభ్యులు అప్పటి కాంగ్రెస్ పాలకులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది.

### లాయర్ ఫీజులు చెల్లించిన కేటీఆర్

సిరిసిల్ల ఎమ్మెల్యేగా కేటీఆర్ 2009లో ఎన్నికవగా, బాధిత కుటుంబసభ్యులు ఆయనను కలిసి వేడుకున్నారు. వారి దయనీయ స్థితికి చలించిన కేటీఆర్ అనేక ప్రయత్నాలు చేశారు. దుబాయ్ చట్టాల ప్రకారం.. బాధిత కుటుంబానికి పరిహారం అందించి, వారి కుటుంబసభ్యులు క్షమాభిక్ష ప్రసాదిస్తే శిక్ష రద్దు అవుతుంది. ఈ నేపథ్యంలో కేటీఆర్ 2013లో స్వయంగా నేపాల్‌కు వెళ్లి దిల్‌బహదూర్ భార్యకు 15 లక్షలు అందజేసి క్షమాభిక్షకు మార్గం సుగమం చేశారు. ఆమె సంతకం చేసిన పత్రాలను కోర్టులో సమర్పించి క్షమాభిక్ష ప్రసాదించాలని కోరారు. వివిధ కారణాల వల్ల నేరతీవ్రతను దృష్టిలో ఉంచుకుని కోర్టు క్షమాభిక్ష ప్రసాదించలేదు. ఈ కేసు వాదించేందుకు దుబాయ్ లాయర్‌కు ఫీజులు సైతం కేటీఆరే చెల్లించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తన కార్యాలయ అధికారులను దుబాయ్ పంపించి కేసును సమీక్షిస్తూ వచ్చారు. నిరుడు దుబాయ్ పర్యటనలో భారత కాన్సుల్ జనరల్ కార్యాలయ అధికారులు, అక్కడి ప్రభుత్వ అధికారులు, కేసు వాదిస్తున్న అరబ్ లాయర్లతో సమావేశమై చర్చించారు. క్షమాభిక్ష ప్రసాదించే విషయమై దుబాయ్ రాజుతో ప్రస్తావించాలని అక్కడి కాన్సుల్ రామ్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. కేటీఆర్ 17 ఏండ్ల ప్రయత్నాలతో కోర్టు ఇటీవలే క్షమాభిక్ష పెట్టింది.

### ఒక్కొక్కరుగా ఇండ్లకు..

18 ఏండ్లు జైలులో మగ్గిన ఈ ఐదుగురికి విముక్తి లభించగా, ఒక్కొక్కరు విడుదలవుతూ స్వదేశానికి వస్తున్నారు. నెల కిందట కోనరావుపేటకు చెందిన దండుగుల లక్ష్మణ్ (48) విడుదలై ఇంటికి వచ్చాడు. నాలుగు రోజుల క్రితం జగిత్యాల జిల్లా మల్యాలకు చెందిన శివరాత్రి హన్మంతు (51) స్వగ్రామానికి చేరుకున్నాడు. అయితే పెద్దూరుకు చెందిన అన్నదమ్ములు శివరాత్రి మల్లేశం, రవి విడుదల కాగా, టికెట్లకు డబ్బుల్లేక ఆగిపోయారు. వారికి కేటీఆర్ విమాన టికెట్లు సమకూర్చారు. బుధవారం వారు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అప్పటికే కేటీఆర్ ఆదేశాలతో కుటుంబసభ్యులను బీఆర్‌ఎస్ నేతలు అక్కడికి తీసుకెళ్లారు. అక్కడ తమవారిని చూడగానే భార్య, పిల్లలు కన్నీటి పర్యంతమయ్యారు. 'కొడుకులారా..? మిమ్మల్ని జన్మలో చూస్తామనుకోలేదు' అంటూ వారి తండ్రి ఉద్వేగానికి లోనయ్యారు. తమ వారు కేటీఆర్ సార్ దయతోనే ఇంటికి చేరారని, సార్ సల్లంగా ఉండాలని కుటుంబీకులు తెలిపారు. కేటీఆర్‌కు కృతజ్ఞతగా గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. మరో వ్యక్తి చందుర్తికి చెందిన నాంపల్లి వెంకటి (48) త్వరలోనే స్వదేశానికి రానున్నాడు.

### కేటీఆర్ సార్ సాయంతోనే విడుదలయ్యాం



కేటీఆర్ సార్ సాయంతోనే మేము విడుదలయ్యాం. 30 లక్షల దాకా మా కోసం ఖర్చు పెట్టారు. 15 లక్షలు చనిపోయిన కుటుంబానికి 2013లోనే ఇచ్చింన్రు. దుబాయ్‌లో న్యాయసేవల కోసం 13 లక్షలు, ఇతర ఖర్చులు పెట్టి ఇయ్యాల ఇంటి దాకా రప్పిచ్చింన్రు. ఇయ్యాల మావాళ్లను చూడగానే ఆనందంతో కన్నీళ్లు వచ్చాయి. కేటీఆర్ సార్ దయతోనే వాళ్లను చూస్తున్నం. సార్‌కు రుణపడి ఉంటాం.

**- శివరాత్రి మల్లేశం, పెద్దూరు**

### కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేస్తే.. రాజకీయాల నుంచి తప్పుకొంటం

- రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అసాధ్యం
- మాజీ ఆర్థిక మంత్రిగా చెప్తున్న : ఈటల

ఆత్మకూరు(ఎం)/యాదగిరిగుట్ట/మోటకొండూరు/నాగారం మోత్కూరు, ఫిబ్రవరి 21: ఎన్నికల్లో అమలు కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటామని.. ఈ మాట తాను మాజీ ఆర్థిక మంత్రిగా చెప్తున్నానని మాజీ మంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప యాత్ర బుధవారం యాదాద్రి జిల్లా ఆత్మకూరు (ఎం), యాదగిరిగుట్ట, మోటకొండూరు, సూర్యాపేట జిల్లా నాగారం, మోత్కూరు మండలాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం ప్రధాని మోదీ నాయకత్వం అవసరమని చెప్పారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మరో 20 ఏండ్ల వరకు కేంద్రంలో అధికారంలోకి రాదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చకుండా కల్లబొల్లి మాటలు చెప్తూ పబ్బం గడుపుతున్నదని విమర్శించారు. 'రైతు రుణమాఫీ ఏమాయె?.. రైతుబంధు ఎటుపాయె?.. మహిళలకు రూ.2500, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇప్పటి వరకు ఇవ్వడం చేతగాని ప్రభుత్వం ఇది'.. అంటూ ఎద్దేవా చేశారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ సాధ్యంకాని హామీ అన్నారు. ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లు వేసింది ప్రేమతో కాదని పేర్కొన్నారు. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుంటే మంత్రులను, కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లోకి రానివ్వకుండా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

### నేటి నుంచి సీపీఎం స్టేట్ ప్లీనరీ

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): సీపీఎం రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు ఈ నెల 22, 23 తేదీల్లో జరగనున్నాయి. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ఈ సమావేశాలకు రాష్ట్ర, జిల్లా కమిటీల సభ్యులు హాజరుకానున్నారు.

# బీజేపీతో పొత్తు పెట్టుకొనే గతి పట్టలేదు

- మతఛాందసవాద పార్టీతో మాకేంటి పని?
- అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి వచ్చింది కేవలం 18 శాతం ఓట్లే
- బీఆర్‌ఎస్ పార్టీని విమర్శించేందుకు సిగ్గుండాలి
- కాంగ్రెస్‌కు గ్యారెంటీలు అమలు చేసే దమ్ముందా?
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్‌ఘన్‌పూర్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 21: బీజేపీతో పొత్తు పెట్టుకునే గతి తమకు పట్టలేదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మతఛాందసవాద పార్టీతో కలిసి నడవాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. బుధవారం ఆయన జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో మీడియాతో మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 37 శాతం ఓట్లు సాధించి 39 సీట్లు గెలిచామని, 18 శాతం ఓట్లతో 8 సీట్లు సాధించిన బీజేపీతో తమకు పొత్తు అవసరం లేదని కుండబద్దలు కొట్టారు. 4 వేల ఓట్లు రాని బీజేపీ వారు లక్ష ఓట్ల మెజార్టీ తెచ్చుకున్న బీఆర్‌ఎస్‌ను విమర్శించేందుకు సిగ్గుండాలని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో బీజేపీ లేదని, తెలంగాణ కొరకు రాజీనామా చేయనివారు, ప్రజలకోసం జైలుకు పోనివారు, పోరాడని బీజేపీ నేతలు ఏ మోహం పెట్టుకొని విమర్శిస్తున్నారని ప్రశ్నించారు. ఈ పదేండ్లలో ఎన్ని నిధులు తెచ్చారు? ఎన్ని ప్రాజెక్టులు తెచ్చారు? ఎన్ని వర్సిటీలు తెచ్చారు? ఎన్ని ప్రాజెక్టులకు జాతీయ హోదా తెచ్చారో? కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు స్టీల్ ఫ్యాక్టరీ తెచ్చారా? కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ తెచ్చారా? తెలంగాణలో ఏం ఒరగబెట్టారని రథయాత్రలు చేస్తున్నారు? అని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యే పోటీ ఉంటుందని స్పష్టం చేశారు.

### గ్యారెంటీలు అమలు చేసే దమ్ముందా?

కాంగ్రెస్‌కు ఆరు గ్యారెంటీలు అమలు చేసే దమ్ముందా? అని కడియం ప్రశ్నించారు. అధికార దాహంతోనే కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చిందని అన్నారు. గ్యారెంటీలను అమలు చేయలేక ఏడాదిలోపే కాంగ్రెస్ సర్కార్ ప్రజల ముందు నవ్వుల పాలవుతుందని జోస్యం చెప్పారు. అధికార దాహం తో కాంగ్రెస్ ప్రజలకు హామీల రూపంలో అరచేతిలో వైకుంఠం చూపించిందని, అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు.

## అభ్యర్థులను ఖరారు చేసేది రేవంతేనా?

- ఎంపీ టికెట్ల కసరత్తు అంతా ఒట్టిదేనా?
- మహబూబ్‌నగర్ అభ్యర్థిగా వంశీచందర్‌రెడ్డి
- కొడంగల్‌లో 50 వేల మెజార్టీ ఇవ్వాలని సీఎం పిలుపు

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థులను ఖరారు చేసేది పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డేనా? అంటే, అవుననే సమాధానం వస్తున్నది. అభ్యర్థుల ఎంపికకు పీసీసీ, ఏఐసీసీ చేస్తున్న కసరత్తు అంతా ఒట్టిదేనని బుధవారం తేలిపోయింది. కోస్గిలో నిర్వహించిన బహిరంగ సభలో మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థిగా వంశీచందర్‌రెడ్డి పేరును రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ నుంచే వంశీచందర్‌రెడ్డికి 50 వేల మెజార్టీ ఇచ్చి గెలిపించాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎంపీ టికెట్లను ఏఐసీసీ ఖరారు చేస్తుందంటూ ఇంతకాలం తాము నమ్మినదంతా ఒట్టిదేనని తేలిపోయిందని ఆశావహులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక బాధ్యతను అధిష్ఠానం రేవంత్‌రెడ్డికే అప్పగించి ఉంటే.. పీసీసీ దరఖాస్తులు స్వీకరించడం, 50 వేల చొప్పున ఫీజు వసూలు చేయడం, డీసీసీల నుంచి ఆశావహుల పేర్లు తెప్పించుకోవడం, వాటిపై ప్రదేశ్ ఎన్నికల కమిటీ కసరత్తు చేయడం, టికెట్ల ఖరారుపై తుది నిర్ణయం కేంద్ర ఎన్నికల స్క్రీనింగ్ కమిటీదే అన్నట్టుగా బిల్డప్ ఇవ్వడం ఎందుకనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఎంపీ అభ్యర్థుల ఖరారుకు ఏఐసీసీ కసరత్తు చేస్తున్నదని ఒక వైపు నమ్మిస్తూ, మరోవైపు మహబూబ్‌నగర్ అభ్యర్థిగా వంశీచందర్‌రెడ్డి పేరును ప్రకటించడంతో ఆశావహులు కంగుతిన్నారు. టికెట్ల ఎంపికకు కసరత్తు జరుగుతున్నట్టు పీసీసీ, ఏఐసీసీ తమను నమ్మించి మోసం చేస్తున్నాయని లబోదిబోమంటున్నారు.

# వారంలో ఫ్రీ కరెంట్

మొదటిపేజీ తరువాయి...

అధికారంలోకి వస్తే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయహోదా కల్పిస్తామంటూ ప్రధాని మోదీ ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. రాష్ట్రంలో నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ ఐదేండ్లలో నాలుగు పైసలు కూడా తీసుకురాలేదని దుయ్యబట్టారు. గత పదేండ్లలో బీజేపీ ప్రభుత్వం ఒక ప్రాజెక్టు కానీ, పరిశ్రమ కానీ రాష్ట్రానికి ఇవ్వలేదని, ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. రానున్న ఐదేండ్లల్లో ప్రతి ఎకరాకూ కృష్ణా జలాలను అందిస్తామని హామీ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థికి 50 వేల మెజార్టీ అందిస్తే మరో రూ.5 వేల కోట్ల అభివృద్ధి నిధులను మంజూరు చేస్తామని చెప్పారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజీవ్‌భీమా పథకంలో భాగంగా ఏడు టీఎంసీలను తరలించేందుకు రూ.2,945 కోట్లతో నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేశామని, దీనిద్వారా మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. రూ.4 వేల కోట్ల అభివృద్ధి పనులతో కొడంగల్ నియోజకవర్గ రూపురేఖలు మారనున్నాయని పేర్కొన్నారు. అనంతరం మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచందర్‌రెడ్డి పోటీ చేస్తారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో ఢిల్లీలో తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి, వికారాబాద్, నారాయణపేట జెడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



### కొడంగల్‌కు 4,369.14 కోట్లు

బుధవారం హెలికాప్టర్‌లో కోస్గి పట్టణానికి చేరుకున్న రేవంత్‌రెడ్డి.. రూ.4,369.14 కోట్లతో కొడంగల్ నియోజకవర్గంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన మహిళా స్వయం సహాయక సంఘాల ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టే పనిని మహిళా సంఘాలకు అప్పగిస్తామని, వారికి కొత్త కుట్టుమిషన్లు ఇస్తామని ప్రకటించారు. ఐకేపీ ద్వారా రుణాలు ఇవ్వడమే కాకుండా, పంటలన్నింటినీ ఐకేపీ ద్వారా కొనుగోలు చేస్తామని చెప్పారు. అనంతరం రూ.177.53 కోట్ల చెక్కును 3,083 మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. కోస్గి పట్టణానికి నారాయణరెడ్డి అందించిన అంబులెన్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

### మార్చి 3న 500కే గ్యాస్‌కు శ్రీకారం?

హైదరాబాద్, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ): ఆరు గ్యారెంటీల్లో భాగమైన మహాలక్ష్మి పథకంలోని రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీని అమలుచేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నది. మార్చి 2 లేదా 3న ఈ పథకాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. ఈ పథకం అమలు కోసం పౌరసరఫరాల శాఖ ప్రత్యేకంగా పోర్టల్‌ను తయారుచేస్తున్నట్టు సమాచారం. ఒకవేళ పోర్టల్ సిద్ధమై అన్నీ కుదిరితే ఈ నెలాఖరులోనే ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సబ్సిడీ మొత్తాన్ని నేరుగా వినియోగదారులకే డీబీటీ ద్వారా వారి ఖాతాలో జమ చేసేందుకు పౌరసరఫరాల శాఖ కసరత్తు చేస్తున్నది. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.955. అయితే రూ.500కే గ్యాస్ ఇవ్వనున్న నేపథ్యంలో వినియోగదారులు అదనంగా చెల్లించిన రూ.455ను వారి బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనున్నది. ఇందుకోసం రూపొందించే ప్రత్యేక పోర్టల్‌లో ఆ వివరాలన్నీ పొందుపరచనున్నది. రాజస్థాన్‌లో సబ్సిడీ గ్యాస్ పథకానికి ఇలాంటి విధానాన్నే అమలుచేస్తున్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారందరికీ సబ్సిడీ గ్యాస్ సిలిండర్ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో సుమారు 90 లక్షల తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో గ్యాస్ కనెక్షన్ ఉన్నవారు 64 లక్షల మందే ఉన్నట్టు పౌరసరఫరాల శాఖ లెక్కలు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పథకాన్ని ఎంతమందికి అమలు చేస్తారనే దానిపై స్పష్టత రావాల్సి ఉన్నది.



మీడియాతో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి, పక్కన బాజిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి

# 'పాలమూరు-రంగారెడ్డి'ని పండబెడతరా?

- కొడంగల్, నారాయణ్‌పేటకు ఇదే ప్రాజెక్టు కరెక్ట్
- తక్కువ ఖర్చు, సమయంలోనే సాగునీరు ఇవ్వొచ్చు
- భేషజాలకు పోయి జూరాల ఎత్తిపోతలకు ఆమోదం
- కేసీఆర్‌కు పేరొస్తుందనే కాంగ్రెస్ చెడగొట్టే పని
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజం

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): తొంబై శాతం పనులు పూర్తయిన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పండబెడతారా? అని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అనుమానం వ్యక్తంచేశారు. కొడంగల్, నారాయణ్‌పేట ప్రాంతాలకు ఈ ప్రాజెక్టు గ్రావిటీ ద్వారా తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో సాగునీటిని అందించవచ్చని తెలిపారు. దానిని కాదని తక్కువ నీటి లభ్యత, ఎక్కువ ఖర్చు, ఎక్కువ సమయం తీసుకునే జూరాల ఎత్తిపోతల పథకంతో నీటిని అందించాలనే నిర్ణయంపై పునరాలోచించాని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ చైర్మన్ ఏ వెంకటేశ్వరరెడ్డితో కలిసి బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జూరాల సామర్థ్యం కేవలం 6.50 టీఎంసీలేనని, కేవలం 40 రోజులు మాత్రమే వరద ఉంటుందనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. కేసీఆర్‌కు ఎక్కడ పేరొస్తుందనే భేషజాలకు పోతున్నారని విమర్శించారు. పునరాలోచించి జూరాల నుంచి ఎత్తిపోసే నిర్ణయపై పునరాలోచన చేయాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి హితవు పలికారు.